సాక్షి
నాగర్‌కర్నూల్
శుక్రవారం । 15 । ఆగస్టు । 2025



శ్రీశైలం డ్యాం మూడు గేట్ల నుంచి దిగువకు విడుదలవుతున్న వరద

అంతా.. అప్రమత్తం

జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో అధికారుల హై అలర్ట్

- ప్రాణ, ఆస్తినష్టం సంభవించకుండా అధికారుల పటిష్ట చర్యలు
- జిల్లావ్యాప్తంగా మత్తడి దూకుతున్న చెరువులు
- ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగులు
- పలుచోట్ల కేఎల్‌ఐ కాల్వకు గండి

సాక్షి, నాగర్‌కర్నూల్: భారీ వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. నిరాటంకంగా కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని దాదాపుగా చెరువులన్నీ ఉప్పొంగి మత్తడి దూకుతున్నాయి. వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పలుచోట్ల లోలెవల్ వంతెల వద్ద వరద పోటెత్తుతోంది. వర్షాల కారణంగా ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం కలగకుండా ఉండేందుకు కలెక్టర్ సంతోష్ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో అధికారులంతా ప్రజలకు అందుబాటులో ఉంటూ.. అత్యవసర సేవలు అందించాలని ఆదేశాలు జారీ చేశారు.

కల్వకుర్తిలో 147.6 మి.మీ. వర్షం

జిల్లాలో బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. అత్యధికంగా కల్వకుర్తి మండలంలో 147.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. తిమ్మాజిపేట మండలంలో 105.5 మి.మీ. వర్షం కురిసింది. పెద్దకొత్తపల్లి, వెల్దండ, ఉప్పునుంతల, ఊర్కొండ, వంగూరు, బిజినేపల్లి, కోడేరు, చారకొండ, నాగర్‌కర్నూల్, తాడూరు మండలాల్లో 60 మి.మీ. మించి వర్షపాతం నమోదైంది. జిల్లాలో దుందుభీ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. కల్వకుర్తి మండలం రఘుపతిపేట వద్ద దుందుభీ ప్రవాహాన్ని అధికారులు పర్యవేక్షించారు. అచ్చంపేట మండలం మన్నెవారిపల్లె వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వంతెనపై రాకపోకలు నిలిచిపోయాయి. ఉప్పునుంతల మండలంలో దుందుభీ వాగుతో పాటు చిలకల వాగు ప్రవాహం అధికం కావడంతో స్థానిక ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. జిల్లాకేంద్రంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రాంనగర్ కాలనీలో ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. కల్వకుర్తి విద్యానగర్ కాలనీలో జలమయంగా మారింది.



కల్వకుర్తి విద్యానగర్ కాలనీలో చేరిన వర్షపునీరు



జిల్లాకేంద్రంలోని కేసరి సముద్రం చెరువు అలుగులో పడిన వ్యక్తిని రక్షిస్తున్న స్థానికులు



ఉప్పునుంతల మండలం మొల్గర వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న దుందుభీ వాగు

మూడు చోట్ల తెగిన కేఎల్‌ఐ కాల్వ..

కేఎల్‌ఐ కాల్వకు పలుచోట్ల గండ్లు పడటంతో సమీపంలోని పంటపొలాలు జలమయం అయ్యాయి. చారకొండ మండలం జూపల్లిలో కేఎల్‌ఐ కాల్వ తెగిన ప్రాంతాన్ని కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పరిశీలించారు. వెల్దండ సమీపంలోని కేఎల్‌ఐ డీ–82 కెనాల్‌కు గండిపడింది. కల్వకుర్తి మండలం తాండ్ర సమీపంలో తెగిన కేఎల్‌ఐ కాల్వను అధికారులు పరిశీలించారు. జిల్లాకేంద్రంలోని కేసరి సముద్రం చెరువు వాగుతో పాటు తూడుకుర్తి సమీపంలో ప్రమాదకరంగా పారుతున్న వాగును బైక్‌లపై దాటుతూ కిందపడిన వ్యక్తులను స్థానికులు రక్షించారు.

గురువారం జిల్లాలో నమోదైన వర్షపాతం వివరాలిలా (మి.మీటర్లలో)..

మండలం	వర్షపాతం
కల్వకుర్తి	147.6
తిమ్మాజిపేట	105.5
పెద్దకొత్తపల్లి	97.9
వెల్దండ	84
ఉప్పునుంతల	83.4
ఊర్కొండ	77.9
వంగూరు	76
బిజినేపల్లి	75.3
కోడేరు	67.9
చారకొండ	66.2
నాగర్‌కర్నూల్	63.7
తాడూరు	60.1
అచ్చంపేట	56
కొల్లాపూర్	50.8
పదర	46.3
లింగాల	43.3
బల్మూరు	38.1
తెలకపల్లి	34.4
పెంట్లవెల్లి	29.7

నష్ట నివారణకు కంట్రోల్ రూం..

జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో ప్రాణ, ఆస్తి నష్టం నివారణకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. వరద ప్రభవిత, ముంపు ప్రాంతాల్లో ప్రజలను రక్షించేందుకు కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్‌రూం ఏర్పాటుచేశారు. జిల్లాలో ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే 08540– 230201, 08540–230203 నంబర్లకు సమాచారం అందించాలని కలెక్టర్ సంతోష్ తెలిపారు. ప్రమాదకరంగా ప్రవహించే వాగులు, వంతెనలను ఎట్టి పరిస్థితుల్లో దాటేందుకు ప్రయత్నించవద్దని.. లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచిస్తున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు రావాలని అధికారులు చెబుతున్నారు.

ఆగని అవినీతి..

- అందని ద్రాక్షగానే స్వేచ్ఛ.. సమానత్వం
- చట్టసభలు, అధికారుల్లో మార్పు రావాలి
- మరింత నీతి, నిజాయితీగా పనిచేయాలి
- 'సాక్షి' సర్వేలో ప్రజల అభిమతం

'స్వతంత్ర భారతదేశంలో అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట పడడం లేదు. దాదాపు అన్ని రంగాల్లోనూ అవే రాజ్యమేలుతున్నాయి. స్వేచ్ఛ.. సమానత్వం అనేవి మాటలకే పరిమితమయ్యాయి. విద్య, వైద్యం అంటే కాసులు కుమ్మరించాల్సిందే.. సామాన్యులకు అందుబాటులో ఉండేలా ఆయా విభాగాల్లో మెరుగైన ఫలితాల సాధనకు ప్రజాప్రతినిధులు మరింత కృషిచేయాలి.. ఈ మేరకు చట్టసభలతో పాటు అధికార యంత్రాంగంలో మార్పు రావాలి. మరింత నీతి, నిజాయితీగా పనిచేస్తూ స్వాతంత్య్ర ఫలాలను ప్రతిఒక్కరికీ అందించాలి..' అనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో 78 ఏళ్లు పూర్తి చేసుకుని శుక్రవారం 79వ వసంతంలోకి అడుగిడుతున్న స్వతంత్ర భారతావనిలో స్వాతంత్య్ర ఫలాలు అందుతున్నాయా? వంటి పలు అంశాలపై 'సాక్షి' గురువారం సర్వే చేపట్టింది. పలు వర్గాల ప్రజలు ఉత్సాహంగా తమ అభిప్రాయాలను వెల్లడించారు. - సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్


సర్వే సాగిందిలా..

ఉమ్మడి పాలమూరులోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, జోగుళాంబ గద్వాల, వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో మొత్తం 150 మంది నుంచి 'సాక్షి' బృందం శాంపిళ్లు సేకరించింది. ఒక్కో జిల్లా నుంచి 30 మంది (పురుషులు 15, మహిళలు 15) చొప్పున అభిప్రాయాలు తీసుకుంది. ఎంచుకున్న మూడు ప్రశ్నలకు ఒక్కొక్కరి నుంచి సమాధానాలను రాబట్టింది. ఈ సందర్భంగా పలువురు తమ తమ అభిప్రాయాలను వెల్లడిస్తూ వ్యవస్థలోని కాలానుగుణ మార్పులు, లోపాలతో పాటు ఇంకా మెరుగు కావాల్సిన అంశాలను ప్రస్తావించారు.

78 ఏళ్ల స్వాతంత్య్రం తర్వాత మీరు ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్య ఏమిటి?



స్వాతంత్య్ర ఫలాలు అందరికీ దక్కాలంటే మరింత నీతి, నిజాయితీగా పనిచేయాల్సిన రంగాలు ఏవి ?



స్వేచ్ఛ- సమానత్వం నిజంగానే అందరికీ చేరుతోందా?



అంతరాలు తొలగించాలి..

సుపరిపాలన అందించే దిశగా ప్రధానంగా చట్టసభలు, అధికార యంత్రాంగంలో మార్పు రావాలనే ఆకాంక్ష ప్రజల్లో వ్యక్తమవుతోంది. పేదలు, సంపన్నుల మధ్య అంతరాలు తొలగేలా ప్రభుత్వాలు స్పష్టమైన వైఖరితో ముందుకుసాగాలని.. వ్యవస్థలను నిర్వీర్యం చేసే శక్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలని కోరుతున్నారు. రాజకీయ నేతల ప్రమేయం గానీ, వారి ప్రభావం గానీ లేకుంటే అధికార యంత్రాంగం బాగానే పనిచేస్తుందని.. అప్పుడు న్యాయస్థానాలు, మీడియా అవసరం ఉండదని పలువురు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు.

స్వాతంత్య్ర వేడుకలకు సర్వం సిద్ధం

- జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో ఏర్పాట్లు పూర్తి
- జాతీయ జెండాను ఎగురవేయనున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి



పోలీస్ పరేడ్ మైదానంలో ఏర్పాటుచేసిన వేదిక

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ మైదానంలో శుక్రవారం 79వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. వేడుకలకు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు, విద్యార్థులు పెద్దఎత్తున హాజరుకానున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. పోలీసు పరేడ్ మైదానానికి వచ్చే ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే లోపలికి అనుమతిస్తారు. వేడుకల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు.

నేటి కార్యక్రమాలు ఇలా..

జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో ఉదయం 9:15 గంటలకు ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ రాకతో స్వాతంత్య్ర వేడుకలు ప్రారంభమవుతాయి. ఉదయం 9:20 గంటలకు కలెక్టర్ బదావత్ సంతోష్, 9:25 గంటలకు ముఖ్య అతిథి జి.చిన్నారెడ్డి హాజరు కానున్నారు. 9:30 గంటలకు ముఖ్యఅతిథి జాతీయ జెండా ఎగురవేసిన తర్వాత జాతీయ గీతాలాపన, రాష్ట్ర అధికారిక గీతాపాలన చేయనున్నారు. 9:35 గంటలకు పోలీస్ కవాతు, 9:45 గంటలకు ముఖ్య అతిథి సందేశం, 10:15 గంటలకు విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు, 10:45 గంటలకు స్వాతంత్య్ర సమరయోధులకు సన్మానం, 10:50 గంటలకు స్టాల్స్ సందర్శన, 11:30 గంటలకు వందన సమర్పణతో వేడుకలు ముగియనున్నాయి.

న్యూస్‌రీల్

ఉమామహేశ్వరంలో దర్శనాలు రద్దు

అచ్చంపేట రూరల్: ఉమామహేశ్వర క్షేత్రంలో రెండు రోజులపాటు దర్శనాలను నిలిపివేశారు. భారీ వర్షాల కారణంగా గురువారం ఘాట్ రోడ్డులో పెద్ద బండరాళ్లు నేలకూలాయి. గుట్టల నుంచి భారీగా వరద ప్రవహిస్తుండటంతో ఏ క్షణంలోనైనా కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో డీఎస్పీ శ్రీనివాసులు ఉమామహేశ్వర క్షేత్రాన్ని సందర్శించి పరిశీలించారు. భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకొని స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి సూచనల మేరకు ఆలయానికి మరో రెండు రోజులపాటు భక్తుల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

లైసెన్స్‌డ్ సర్వేయర్లకు రెండో విడత శిక్షణ

నాగర్‌కర్నూల్: జిల్లా కేంద్రంలో ఈ నెల 18నుంచి 22వ తేదీ వరకు లైసెన్స్‌డ్ సర్వేయర్లకు రెండో విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణకు అర్హత కలిగిన 202మంది అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డుతో పాటు ఒక సెట్ జిరాక్స్‌తో 18న ఉదయం 9గంటలకు కలెక్టరేట్‌లోని రూం నంబర్ ఎఫ్–2లో హాజరు కావాలని సూచించారు.

శిథిల భవనాల్లో ఎవరూ ఉండొద్దు

- కృష్ణానదిలో బోటు ప్రయాణం నిషేధం
- అత్యవసర శాఖల అధికారులు నిరంతరం అందుబాటులో ఉండాలి
- కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశం



జూపల్లి శివారులో కేఎల్‌ఐ కాల్వ గండి పడటానికి గల కారణాలను అధికారులతో తెలుసుకుంటున్న కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

నాగర్‌కర్నూల్/వెల్దండ/చారకొండ: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. శిథిల భవనాల్లో ఎవరూ ఉండొద్దని కలెక్టర్ బదావత్ సంతోష్ సూచించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎస్ రామకృష్ణారావు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా.. కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయంలతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. వీసీ అనంతరం సంబంధిత అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఎక్కడా ప్రాణ, ఆస్తినష్టం సంభవించకుండా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రజలకు అత్యవసర సేవలు అందించేందుకు కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్‌రూం ఏర్పాటుచేసినట్లు చెప్పారు. అన్నిశాఖల అధికారులు 24గంటలు అందుబాటులో ఉంటూ.. సమగ్ర సమాచారంతో వరద నిర్వహణ కార్యాచరణ సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. శిథిల భవనాల్లో నివసించే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. అవసరమైన చోట పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేయాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో గజ ఈతగాళ్లు, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాల్లో తరగతులు నిర్వహించవద్దని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా అధిక వర్షపాతం నమోదు అయితే వెంటనే పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ఇవ్వాలని డీఈఓ, డీడబ్ల్యూఓలను కలెక్టర్ ఆదేశించారు. వాగులు, పాటుకాల్వల్లో వరద సాఫీగా ముందుకు పారేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. సాగునీటి కాల్వలు, చెరువులకు గండ్లు పడకుండా గట్లను పటిష్టం చేయాలని సూచించారు. సోమశిల, ఇతర పర్యాటక ప్రదేశాల్లోని కృష్ణానదిలో బోటు ప్రయాణాన్ని నిషేధించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రసవానికి రెండు, మూడు రోజుల సమయం ఉన్న గర్భిణుల సంరక్షణ బాధ్యత వైద్యారోగ్యశాఖ అధికారులదేనని అన్నారు. వర్షాల అనంతరం జిల్లాలో ఎక్కడా వ్యాధులు ప్రబలకుండా అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.

■ వెల్దండ సమీపంలో ఇటీవల కోతకు గురైన డీ–82 కాల్వను కలెక్టర్ పరిశీలించారు. కాల్వ మరమ్మతు పనులు నాణ్యతగా చేపట్టి త్వరగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదే విధంగా చారకొండ మండలం జూపల్లి శివారులో గండి పడిన డీ–82 కాల్వను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి కలెక్టర్ పరిశీలించి.. గండికి గల కారణాలపై ఆరా తీశారు. కాల్వ డిజైన్ మ్యాప్‌ను పరిశీలించారు. కాల్వ గండికి వేగంగా మరమ్మతు చేయించి.. ఆయకట్టు రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు. వారి వెంట కేఎల్‌ఐ చీఫ్ ఇంజినీరు విజయ్‌కుమార్, ఎస్‌ఈ పార్థసారథి, ఈఈ శ్రీకాంత్, డీఈఈలు దేవన్న, బుచ్చిబాబు తదితరులు ఉన్నారు.

'చంద్రసాగర్-అమ్రాబాద్' పథకం చేపట్టాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి

కొల్లాపూర్: అచ్చంపేట నియోజకవర్గంలోని అప్పర్ ప్లాట్ ఎగువ, దిగువ ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించేందుకు చంద్రసాగర్–అమ్రాబాద్ ఎత్తిపోతల పథకాన్ని వెంటనే చేపట్టాలని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఆయన కొల్లాపూర్‌లో విలేకర్లతో మాట్లాడారు. పాలమూరు జిల్లా అవసరాలకు అనుగుణంగా కృష్ణా జలాలను వాడుకోవడంలో నేటికీ పాలకులు నిర్లక్ష్యం కనబరుస్తూనే ఉన్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో నీటి వాటా వినియోగంలో జరిగిన అన్యాయాన్ని తెలంగాణ వచ్చాక కూడా సరిచేయడం లేదన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టు పనుల పూర్తికి అవసరమైన నిధుల కేటాయింపులు జరగడం లేదన్నారు. అచ్చంపేట ఎత్తిపోతల, ఉమామహేశ్వరం ఎత్తిపోతల పథకాలంటూ పాలకులు చేస్తున్న ప్రకటనలపై పునఃసమీక్ష జరపాల్సిన అవసరం ఉందన్నారు. సాగునీటి రంగానికి రూ.లక్షల కోట్లు వెచ్చిస్తున్న ప్రభుత్వాలు.. అప్పర్ ప్లాట్‌లోని 30వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఎందుకు మనసు రావడం లేదో అర్థం కావడం లేదన్నారు. అప్పర్‌ప్లాట్‌కు నీటి సమస్య తీర్చేందుకు పోరాట కార్యాచరణ రూపొందించామని తెలిపారు. అనంతరం అందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాలమూరు అధ్యయన వేదిక గద్వాల జిల్లా కన్వీనర్ ఎండీ ఇక్బాల్ పాషా, డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.వామన్‌కుమార్ పాల్గొన్నారు.

బీజేపీ హయాంలోనే సమగ్రాభివృద్ధి

కందనూలు: బీజేపీ హయాంలోనే దేశం అన్నిరంగాల్లో సమగ్రాభివృద్ధి సాధిస్తోందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వేముల నరేందర్‌రావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు జిల్లా కార్యవర్గాన్ని పూర్తిస్థాయిలో నియమించినట్లు తెలిపారు. జిల్లాలోని అసెంబ్లీ నియోజక వర్గాల్లో పార్టీ కార్యకలాపాలకు అనుగుణంగా చిన్నంబావి, పాన్‌గల్, ఆమనగల్, కడ్తాల్, మాడ్గుల మండలాల నేతలకు స్థానం కల్పించినట్లు చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి అమలుచేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. డోర్నకల్ నుంచి నాగర్‌కర్నూల్ మీదుగా రైల్వే మార్గం కోసం డీపీఆర్ రూపొందించే ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ మొగిలి దుర్గాప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేందర్‌గౌడ్ ఉన్నారు.

తెరుచుకున్న సరళాసాగర్ సైఫన్లు



సరళాసాగర్‌కు ఎగువ ప్రాంతం నుంచి వరద అధికంగా రావడంతో 4 సైఫన్లు తెరుచుకున్నాయి. గురువారం 3 ఉడ్ సైఫన్ల నుంచి 10,520 క్యూసెక్కులు, ప్రైమరీ సైఫన్ నుంచి 500 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. - మదనాపురం

కోయిల్‌సాగర్ 5 గేట్లు ఎత్తివేత



కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నీటి మట్టం పూర్తిస్థాయి చేరడంతో 5 గేట్లను రెండు అడుగుల మేర ఎత్తి 7,500 క్యూసెక్కుల నీటిని పెద్దవాగులోకి వదిలారు. ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభం అయిన తరువాత మొదటిసారి గేట్లను తెరవడంతో సందర్శకులు తరలివచ్చారు. - దేవరకద్ర

ఏఎస్‌ఐ మహ్మద్ మోయిజుద్దీన్‌కి ఇండియన్ పోలీస్ మెడల్



మహబూబ్‌నగర్ క్రైం: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా మహబూబ్‌నగర్ పోలీస్ శాఖలోని డీసీఆర్‌బీలో ఏఎస్‌ఐగా పనిచేస్తున్న మహ్మద్ మోయిజుద్దీన్‌కు ఇండియన్ పోలీస్ మెడల్‌ను భారత ప్రభుత్వం గురువారం ప్రకటించింది. 1989లో పోలీస్ కానిస్టేబుల్‌గా ఎంపికైన మోయిజుద్దీన్ ఉమ్మడి జిల్లాలోని అలంపూర్, తిమ్మాజీపేట, జడ్చర్ల, పెద్దకొత్తపల్లి, కోస్గి పోలీస్‌స్టేషన్‌లలో విధులు నిర్వహించాడు. 2012లో హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి పొంది డీసీఆర్‌బీలో పనిచేశారు. 2018లో ఏఎస్‌ఐగా పదోన్నతి వచ్చిన తర్వాత సీసీఎస్ మహబూబ్‌నగర్, హన్వాడ, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్, కోయిలకొండ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించాడు. తన విశిష్ట సేవలకు గాను ఇప్పటి వరకు 70 క్యాష్ రివార్డులు, 18 జీఎస్‌ఈ, 12 ప్రశంసాపత్రాలు, ఒక సేవా పతకం, 2017లో టీఎస్ ముఖ్యమంత్రి సర్వోన్నత పోలీస్ పథకం, 2019లో ఉత్తమ పోలీస్ పతకం అందుకున్నారు. ఇండియ పోలీస్ మెడల్ వచ్చిన మోయిజుద్దీన్‌ను ఎస్పీ జానకి అభినందించారు.

జాతీయ రహదారిపై నిఘా : డీఐజీ



రాకపోకలను పరిశీలిస్తున్న డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో భూత్పూర్–షేర్‌పల్లి మధ్యలో జాతీయ రహదారిపై వర్షపు నీరు రోడ్డుపైకి రావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడి వాహనాలు నిలిచిపోయాయి. షేర్‌పల్లి పరిధిలో ఉన్న కోమటికుంట చెరువు అలుగు పారడంతో వరద నీరు అధికంగా జాతీయ రహదారి–44పైకి వచ్చింది. దీంతో వాహన రాకపోకలకు అడ్డుగా మారడంతో డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, ఎస్పీ జానకి గురువారం ఉదయం ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. జాతీయ రహదారి కావడంతో పోలీసులు దాదాపు గంటపాటు శ్రమించి సమస్యను పరిష్కరించారు. అనంతరం డీఐజీ మాట్లాడుతూ భారీ వర్షాలు కురుస్తుండటంతో జాతీయ రహదారి వంటి రద్దీ మార్గాలపై నిరంతరం నిఘా పెట్టామన్నారు. వరదలలో మనుషులు, మూగజీవాలు చిక్కుకుంటే వెంటనే డయల్ 100కి లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే జిల్లాకేంద్రంలో పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లే అండర్‌పాస్ పూర్తిగా వర్షపు నీటితో మునిగిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎస్పీ డి.జానకి అక్కడికి చేరుకుని మోటార్లతో నీటిని బయటకు పంపించి రాకపోకలకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం దివిటిపల్లి సమీపంలో అమర్‌రాజా బ్యాటరీ కంపెనీ దగ్గర తెగిపోయిన రోడ్డులో పడిపోయిన బస్సును ఎస్పీ పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

మృతులు భాస్కర్‌గౌడ్, ఎల్లమ్మ





ఎర్రవల్లి: ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని అతివేగంగా వచ్చిన బొలెరో ఢీకొట్టడంతో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందారు. ఈఘటన బీచుపల్లి స్టేజీ దగ్గర గురువారం చోటుచేసుకుంది. ఇటిక్యాల ఎస్ఐ రవి నాయక్ కథనం మేరకు వివరాలిలా.. పెబ్బేరు మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన అల్లాడి భాస్కర్‌గౌడ్ (54), అదే గ్రామానికి చెందిన మినిగోలు ఎల్లమ్మ (46) పొలం పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై బీచుపల్లికి బయల్దేరారు. ఈ క్రమంలో బీచుపల్లి స్టేజీ దగ్గర వారు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న బొలెరో వాహనం అతివేగంతో వచ్చి వెనక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలు కాగా.. అల్లాడి భాస్కర్‌గౌడ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఎల్లమ్మను గద్వాల ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతుడి కుమారుడు అల్లాడి కిరణ్‌గౌడ్ ఫిర్యాదు మేరకు బొలెరో డ్రైవర్ రెడ్డిగారి రామకృష్ణారెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నాడు.

పోలీసుల అదుపులో ఇద్దరు యువకులు

గద్వాల క్రైం: నిషేధిత మత్తు పదార్థాలను విక్రయిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు బుధవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. పట్టణానికి చెందిన యువకులు ఇతర రాష్ట్రాల నుంచి రహస్యంగా గంజాయి కొనుగోలు చేసి వాటిని మైనర్లకు, విద్యార్థులకు విక్రయిస్తున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు వారం రోజుల నుంచి పోలీసులు నిఘా ఉంచారు. ఈ క్రమంలో నాలుగు రోజుల క్రితం జిల్లా కేంద్రం శివారు కాలనీలో ముగ్గురు యువకులు గంజాయి తీసుకుంటున్నట్లు తెలియగా.. పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్ వారిని పట్టుకున్నారు. ముగ్గురిని డీ అడిక్షన్ సెంటర్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇవ్వడంతోపాటు ఆరా తీశారు. దీంతో గద్వాల పట్టణానికి చెందిన ఇద్దరు యువకులు గంజాయి విక్రయినట్లు వివరించారు. నిఘా ఉంచిన పోలీసులు బుధవారం రాత్రి సదరు ఇద్దరు యువకులను పట్టుకున్నారు. గంజాయి ఎక్కడి నుంచి కొనుగోలు చేస్తున్నారు, ఎప్పటి నుంచి విక్రయిస్తున్నారని, ఎంతమంది తీసుకుంటున్నారు అనే విషయాలపై ఆరా తీశారు. అయితే ఆన్‌లైన్, ఇన్‌స్ట్రాగాం సాయంతో రాయచూర్‌కు చెందిన గుర్తు తెలియని వ్యక్తుల నుంచి గంజాయి కొనుగోలు చేస్తున్నట్లు విచారణలో తేలింది. పట్టుబడిన ఇద్దరి వ్యవహార శైలి అనుమానాస్పదంగా ఉండడంతో పలు అంశాలపై ఆరా తీస్తున్నారు. ఈ విషయంపై పట్టణ ఎస్ఐను సంప్రదించగా.. ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని ఆరా తీస్తున్నామని, తాజాగా ముగ్గురు యువకులను డి అడిక్షన్ సెంటర్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇస్తున్నామన్నారు. నిషేధిత మత్తు పదార్థాలు ఎవరైన గుట్టుగా విక్రయించిన, నిల్వ ఉంచుకున్నట్లు తెలిస్తే డయల్ 100 లేదా పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.

ఉరేసుకొని విద్యార్థి ఆత్మహత్య



శివకుమార్ (ఫైల్)

వెల్దండ: ఇటీవల ఇంటర్ పూర్తయి.. బీటెక్‌లో చేరాల్సిన ఓ విద్యార్థి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన వెల్దండలో గురువారం చోటుచేసుకుంది. బంధువులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా.. వెల్దండకు చెందిన భారతమ్మ, కృష్ణయ్య దంపతులకు ఒక కుమార్తె, ఒక కుమారుడు శివకుమార్(17) సంతానం. కుమార్తె బీఈడీ చదువుతుండగా.. కుమారుడు శివకుమార్ హైదరాబాద్‌లోని నారాయణ కళాశాలలో ఇటీవల ఇంటర్ పూర్తి చేశాడు. బీటెక్‌లో చేరాల్సి ఉండగా.. ప్రస్తుతం ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఇద్దరు పిల్లలను ఉన్నత చదువులు చదివించేందుకుగాను తండ్రి కృష్ణయ్య హైదరాబాద్‌లోని ఓ స్వీట్‌షాపులో పనిచేస్తున్నాడు. ఇదిలాఉండగా, తల్లి భారతమ్మ గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో నాగర్‌కర్నూల్‌కు సొంత పని మీద వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో కుమారుడు శివకుమార్ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చుట్టుపక్కల వారు ఇంటి తలుపులు తీసి ఉండడం చూసి లోపలికి వెళ్లి చూడగా.. అప్పటికే మృతిచెందాడు. చేతికి అందివచ్చిన కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. మృతికి గల కారణాలు తెలియరాలేదు. పోలీసులను సంప్రదించగా.. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు. ఇదిలాఉండగా, విషయం తెలుసుకున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

డీసీసీబీ పదవీకాలం పొడిగింపు

- ఆరు నెలలపాటు కొనసాగనున్న ప్రస్తుత పాలకవర్గాలు
- మరోసారి ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



మహబూబ్‌నగర్‌లోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ), ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) పాలకవర్గాల కాల పరిమితి ప్రభుత్వం పొడిగించింది. మరో ఆరు నెలలపాటు ప్రస్తుతం ఉన్న పాలక వర్గాలే కొనసాగేలా నిర్ణయం తీసుకుంది. ఐదేళ్ల క్రితం (2020 ఫిబ్రవరి 15న) సహకార సంఘాల ఎన్నికలు జరిగి పాలకవర్గాలు ఏర్పాటయ్యాయి. వీటి గడువు శుక్రవారంతో ముగియడంతో ప్రభుత్వం పాలకవర్గాల గడువును రెండోసారి మరో ఆరు నెలలు పెంచింది. ఈ మేరకు రాష్ట్ర కోఆపరేషన్, సహకార సంఘాల రిజిస్ట్రార్ కమిషనర్ కె.సురేంద్ర మోహన్ గురువారం జీఓ 386 జారీ చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 78 పీఏసీఎస్‌లు ఉన్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం సహకార సంఘాల గడువును పెంచడంతో డీసీసీబీ చైర్మన్‌గా మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి మరో ఆరునెలల పాటు కొనసాగనున్నారు. అలాగే ఉమ్మడి జిల్లాలోని పీఏసీఎస్‌ల చైర్మన్లు కూడా యథావిధిగా కొనసాగుతారు.

జిల్లాల వారీగా.. పీఏసీఎస్‌లు

జిల్లా	పీఏసీఎస్‌లు
మహబూబ్‌నగర్	14
నాగర్‌కర్నూల్	18
వనపర్తి	13
జోగుళాంబ గద్వాల	11
నారాయణపేట	10
రంగారెడ్డి	9
వికారాబాద్	3

రైతులకు సేవచేసే అవకాశం



రైతులకు మరో ఆరు నెలలు సేవ చేసే అవకాశం లభించింది. పదవీకాలం పొడిగించినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు. ఇందుకు సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, తుమ్మల నాగేశ్వర్‌రావుకు కృతజ్ఞతలు. ఈ అవకాశంతో రైతులకు మరింతగా మెరుగైన సేవలు అందించేందుకు కృషిచేస్తా.

– మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, చైర్మన్, డీసీసీబీ

జూరాలకు స్వల్పంగా తగ్గిన ఇన్‌ఫ్లో

ధరూరు/ ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో స్వల్పంగా తగ్గింది. బుధవారం రాత్రి 8 గంటల వరకు ప్రాజెక్టుకు 90 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. గురువారం 80 వేల క్యూసెక్కులకు తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు 8 క్రస్టు గేట్లను ఎత్తి 54,500 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 44,857 క్యూసెక్కులు దిగువకు వదిలారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.551 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

వేగవంతంగా విద్యుదుత్పత్తి

జూరాలలోని ఎగువ విద్యుత్ కేంద్రంలో 6 యూనిట్ల ద్వారా 234 మెగావాట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. కాగా.. ఎగువ, దిగువ కేంద్రాల్లో ఇప్పటి వరకు 489.140 మి.యూ., విజయవంతంగా చేపట్టినట్లు వివరించారు.

మూడు గ్రామాల్లో దొంగల హల్‌చల్

బంగారం, వెండి అపహరణ

గండేడ్: మండల కేంద్రంతో పాటు రెడ్డిపల్లి, కొంరెడ్డిపల్లిలోని పలు ఇళ్లల్లో బుధవారం రాత్రి దొంగలు చొరబడి మూడు తులాల బంగారం, 12 తులాల వెండిని అపహరించినట్లు ఎస్సై శేఖర్ రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. రెడ్డిపల్లికి చెందిన గాజుల కృష్ణయ్య హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ కుటుంబంతో హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఇంటి తాళం పగులగొట్టి లోనికి చొరబడి బీరువాలో ఉన్న అరతులం బరువున్న రెండు జతల కమ్మలు, రెండు తులాల నల్లపూసల దండ, రూ.1,500 ఎత్తుకెళ్లారు. అలాగే పక్కనే ఉన్న విశ్రాంత ఉపాధ్యాయుడు మల్లయ్య ఇంట్లో చొరబడి రెండు బీరువాలు వెదికినా ఏమీ దొరకలేదు. అదే గ్రామానికి చెందిన కమ్మరి నర్సింహులు మహబూబ్‌నగర్‌లో ఉండగా.. ఆయన ఇంటి తాళం విరగొట్టి అర తులం బంగారు కమ్మలు ఎత్తుకెళ్లారు. అవుసుల జగదీష్ ఇంట్లో చోరీకి యత్నించగా తలుపులు తెరుచుకోకపోవడంతో తిరిగి వెళ్లిపోయారు. అలాగే గండేడ్‌లో కొమ్ము అంజమ్మ బతుకుదెరువు కోసం హైదరాబాద్ వెళ్లింది. ఇంటి తాళం పగులగొట్టి సూటుకేస్‌లో ఉన్న 12 తులాల వెండి ఉంగరాలను ఎత్తుకెళ్లారు. ఈడిగి దేవమ్మ ఇంటి తాళం పగులగొట్టి లోపలున్న తలుపు తెరవడానికి యత్నించగా ఇరుగుపొరుగు వారు లేచి కూత వేయడంతో పారిపోయారు. కొంరెడ్డిపల్లిలో ఏముక రాములు కుటుంబంతో పరిగిలో ఉంటున్నారు. వ్యవసాయ పనులు నడుస్తుండటంతో రాములు రోజు గ్రామానికి వచ్చి వెళ్లేవాడు. బుధవారం ఉదయం ఇంటికి తాళం వేసి వెళ్లిపోయాడు. గురువారం ఉదయం ఆయన బావమరిది రాగా ఇంటి తాళాలు విరగొట్టి ఉన్నాయి. విషయం తెలుసుకున్న రాములు వచ్చి చూడగా కూలీలకు ఇవ్వాల్సిన రూ.20 వేలు దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. దీంతోపాటు ఆరు తులాల వెండి సామగ్రి దొంగలు అపహరించారు. ఘటనా స్థలాలను మహబూబ్‌నగర్ రూరల్ సీఐ గాంధీనాయక్, ఎస్సై శేఖర్ రెడ్డి పరిశీలించారు. బాధితులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్లూస్ టీం సీఐ రాజేంద్ర ఆయా ఇళ్లల్లో ఆధారాలు సేకరించారు. దొంగలు ఒక బైక్, ఒకటకారులో వచ్చినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఎస్టీ గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి బాలికల ఎస్టీ గురుకులంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 18న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు రీజినల్ కోఆర్డినేటర్ సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలన్నారు. పూర్తి వివరాల కోసం సెల్ నంబర్లు 73370 91015, 73822 04326లను సంప్రదించాలని సూచించారు.

ఈజీ మనీ ఆశచూపి రూ.2 లక్షలు మోసం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

- ప్రధాన సూత్రదారుడు స్నేహితుడే..
- ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలింపు

మహబూబ్‌నగర్ క్రైం: నా దగ్గర రాజకీయ నాయకులకు సంబంధించిన బ్లాక్ మనీ చాలా ఉందని.. రూ.లక్ష ఇస్తే రూ.5లక్షలు ఇస్తానని స్నేహితుడిని నమ్మించారు. రూ.2లక్షలు తీసుకొని.. డమ్మీ నోట్లు ఇచ్చి పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు ఒక్క రోజులోనే ఇద్దరు నిందితులను పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను గురువారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు వెల్లడించారు. నారాయణపేట జిల్లాకు చెందిన ఆశప్పకు 20రోజుల కిందట నవాబ్‌పేట మండలం పోమాలి గ్రామానికి చెందిన కె.రాములు ఫోన్ చేసి పరిచయం ఉన్న వ్యక్తి మాదిరిగా మాట్లాడాడు. నా దగ్గర రాజకీయ నాయకులు ఎన్నికల్లో ఉపయోగించే, పంపిణీ చేసే బ్లాక్‌మనీ ఉందని, మీరు రూ.2లక్షలు ఇస్తే రూ.10లక్షలు ఇస్తానని చెప్పాడు. జరిగిన విషయాన్ని ఆశప్ప అతని స్నేహితుడు అయిన వెంకటరాములుకు చెప్పాడు. దీంతో ఇద్దరూ కలిసి ఈనెల 10న మహబూబ్‌నగర్ పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ఎల్లమ్మ గుడి దగ్గరకు వచ్చారు.

రూ.2లక్షలు తీసుకొని.. డమ్మీ నోట్లు ఇచ్చి..

ఈమేరకు కె.రాములు వారిని కలిసి వారి ఇద్దరికి చేరో రూ.500 నోట్ ఇచ్చి ఇలాంటి డబ్బులు నా దగ్గర చాలా ఉన్నాయని నమ్మించాడు. దీంతో కె.రాములు ఇచ్చిన నోట్లు తీసుకుని కోస్గికి వెళ్లిన ఆ ఇద్దరూ నోట్లు చెక్ చేసుకోగా ఒరిజినల్ అని తేలడంతో నమ్మారు. దీంతో ఈ నెల 12న ఆశప్ప రూ.2 లక్షల నగదు తీసుకుని రాగా వెంకట్‌రాములు రూ.2లక్షల విలువ చేసే డమ్మి(ఫేక్) నోట్లు తీసుకుని మహబూబ్‌నగర్ బస్టాండ్‌కు వచ్చారు. ఆశప్ప అతని దగ్గర ఉన్న రూ.2లక్షల నగదు, వెంకటరాములు తన వెంట తెచ్చిన రూ.2లక్షల డమ్మీ నోట్ల కట్టాలను కవర్‌లో పెట్టి కె.రాములుకు అందించారు. ఆ డబ్బులు తీసుకున్న కె.రాములు మీకు ఇవ్వాల్సిన రూ.10లక్షలు కారులో ఉన్నాయని చెప్పి తెస్తానని రోడ్డు దాటివెళ్లిపోయి తన ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. దీంతో మోసపోయిన అని గ్రహించిన ఆశప్ప టూటౌన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడానికి ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి ఒక్కరోజు వ్యవధిలో కేసు చేధించినట్లు డీఎస్పీ తెలిపారు.

ప్లాన్ వేశారిలా..

విచారణలో వెంకటరాములు, కె.రాములు ఇద్దరు స్నేహితులు కలిసి ఆశప్పను ఎలాగైన మోసం చేసి అతని నుంచి డబ్బులు తీసుకోవాలనే పథకంతో వెంకట్‌రాములు కావాలని ఆశప్ప ఫోన్ నెంబర్‌ను కె.రాములుకి ఇచ్చి ఫోన్ చేయించాడు. ఆ తర్వాత ఆశప్పకు తనపై అనుమానం రాకుండా ఉండటానికి వెంకట్‌రాములు డమ్మీ నోట్ల కట్టాలను కన్పించకుండా కవర్‌లో పెట్టి కె.రాములుకు ఇచ్చాడు. సీసీ కెమెరాల సహాయంతో పాటు ఫోన్ నెంబర్ సహాయంతో 24గంటల్లో నేరస్థులను పట్టుకోవడంతో పాటు రూ.2లక్షల నగదు రికవరీ చేశామని వెల్లడించారు. అదేవిధంగా రూ.2లక్షల విలువ చేసే డమ్మీ నోట్లు సీజ్ చేసి ఏ1 కె.రాములు, ఏ2 వెంకట్ రాములు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు డీఎస్పీ తెలిపారు. కేసు చేధించిన టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్, ఎస్ఐ నరేందర్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ శేఖర్, కానిస్టేబుల్స్ వెంకట్‌రాములు, అశోక్‌లను డీఎస్పీ అభినందించారు.

పీయూలో క్యాంపస్ సెలక్షన్స్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో గురువారం దివీస్ ల్యాబ్స్ ఆధ్వర్యంలో క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించారు. ఈ మేరకు వివిధ ఉద్యోగాలకు ఏర్పాటు చేసిన సెలక్షన్స్ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి హాజరై ప్రసంగించారు. విద్యార్థులు క్యాంపస్‌లో చదువులు పూర్తయిన వెంటనే ఉద్యోగాలు పొంది జీవితంలో స్థిరపడటం గొప్ప విషయం అన్నారు. మంచి నైపుణ్యాలు ఉంటే ఉద్యోగ, మంచి వేతనం పొందేందుకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో అర్జున్‌కుమార్, హరికృష్ణ, రామకృష్ణ తదతరులు పాల్గొన్నారు.





స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నటి పూర్ణ, హీరో శివ కందుకూరి పంచుకున్న విశేషాలు

ఒక్కొక్కరం ఒక్కో రంగు - పూర్ణ

● స్కూల్ డేస్‌లో ఇండిపెండెన్స్ డే ప్రోగ్రామ్స్‌లో పాల్గొనేదాన్ని. దేశభక్తి పాటలకు డ్యాన్స్ చేయడం ఓ మంచి గుర్తుగా మిగిలిపోయింది. ఇప్పుడు కూడా నా స్కూల్ డేస్‌ని గుర్తు చేసుకుంటున్నాను. దానికి కారణం దుబాయ్‌లో నేను ఆరంభించిన 'డ్యాన్స్ స్కూల్'. ఈ స్కూల్ స్టార్ట్ చేశాక వచ్చిన తొలి ఇండిపెండెన్స్ డే ఇది. ఈ సందర్భంగా మా స్కూల్ స్టూడెంట్స్‌తో దేశభక్తికి సంబంధించిన రీల్ చేయించాం. సోషల్ మీడియా ద్వారా ఇవాళ రిలీజ్ చేయనున్నాం. రిపబ్లిక్ డే అప్పుడు ఇలాంటిదే చేశాం. అప్పుడు నేను కూడా పాల్గొన్నాను. ఈసారి షూటింగ్స్ ఉండటంతో హైదరాబాద్‌లో ఉన్నాను.

● స్కూల్లో 'ఏ మేరా ఇండియా' అని డ్యాన్స్ చేస్తున్నప్పుడు ఒళ్లు పులకరించిపోయేది. ఇప్పటికీ ఆ పాట పాడుతుంటే ఓ రకమైన ఎమోషన్ కలుగుతుంది. నేను ఫార్మల్‌గా డ్యాన్స్ నేర్చుకున్నాను. అందుకే దేశం పట్ల నాకు ఉన్న భక్తిని దేశభక్తి పాటలకు డ్యాన్స్ చేయడం ద్వారా వ్యక్తపరుస్తుంటాను. అసలు 'ఇండియా' అని పలుకుతుంటేనే ఎంతో బాగుంటుంది.

● చిన్నప్పుడు స్కూల్ ప్రోగ్రామ్స్‌లో పార్టిసిపేట్ చేసినప్పుడు బాగా పర్ఫార్మ్ చేయాలనే దాని మీదే ఎక్కువ ఫోకస్ ఉండేది. అలాగే జెండా రంగులు వచ్చేలా ఒక్కొక్కరం ఒక్కో రంగు డ్రెస్ వేసుకోవడం అనేది ఓ తీపి గుర్తు. తర్వాత తర్వాత మనకు ఇండిపెండెన్స్ రావడానికి ఎందరి త్యాగం ఉందో తెలుసుకుని, వాళ్లందరి మీద గౌరవం పెరిగింది. అలాగే మనం ఇక్కడ క్షేమంగా ఉంటున్నామంటే సరిహద్దుల్లో ఉంటున్న సైనికుల వల్లే. అందుకే ఈ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'సైనికా... సెల్యూట్' అంటున్నాను.

● సైనికుల త్యాగాల గురించి చెబుతుంటే నాకు యాంకర్ రష్మీ గుర్తొస్తున్నారు. ఆమె సోదరుడు ఆర్మీలో ఉన్నారు. యుద్ధం జరిగినప్పుడు అక్కడ ఉన్న తన సోదరుడి గురించి ఇక్కడ వీరి కుటుంబం ఫీలింగ్స్‌ని స్వయంగా చూశాను. సోల్జర్స్ కుటుంబాలు పడే ఆవేదన, దేశ రక్షణలో తమ కుటుంబం నుంచి ఒక వ్యక్తి ఉన్నారనే ఆనందం... ఇలా రెండు ఫీలింగ్స్ కనబడుతుంటాయి.

● భవిష్యత్తులో మన పిల్లలు ఏ ఉద్యోగంలో స్థిరపడతారో చెప్పలేం. కానీ మా అబ్బాయితో మాత్రం 'నిన్ను ఆర్మీలో చేర్పిస్తా' అంటుంటాను. ఎందుకంటే వాడికి ఏ బొమ్మలూ నచ్చవు. అవి ఎంత పెద్దవైనా. వాటి పక్కన చిన్న గన్ ఉంటే చాలు... దాంతోనే ఆడుకుంటాడు. ఎక్కువగా అవే కొనుక్కుంటాడు. అందుకే మా అబ్బాయిలో నాకో సోల్జర్ కనబడుతుంటాడు.

అప్పుడు నేను నెహ్రూ - శివ కందుకూరి

● స్వాతంత్ర్య దినోత్సవం రోజున తప్పనిసరిగా స్కూల్‌కి హాజరవ్వాలనే నియమం ఉంటుంది. రూల్ ఉందని కాదు... ఇష్టంగా వెళ్లేవాణ్ణి. ఆ రోజు జరిగే కార్యక్రమాల్లో పాల్గొనడం ఎప్పుడూ గుర్తుండిపోయే చిన్ననాటి జ్ఞాపకం. జెండా ఎగరేస్తుంటే సెల్యూట్ చేస్తూ, చూడటం నాకు చాలా హ్యాపీగా ఉండేది. అందుకే మిస్ కాకుండా స్కూల్‌కి వెళ్లేవాణ్ణి. నా చిన్నప్పుడు స్కూల్లో ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషన్ కోసం నెహ్రూజీలా డ్రెసప్ అయ్యాను. అలా రెడీ అయి, వెళ్లడం నాకు గుర్తుంది. అప్పుడు దేశభక్తి పూర్తి అర్థం తెలియదు. అయితే ఇప్పుడు ఒక హీరోగా ఏదైనా ఫ్రీడమ్ ఫైటర్ రోల్ చేసే అవకాశం వస్తే... తప్పకుండా చేయాలని ఉంది. ఎందరికో స్ఫూర్తిగా నిలిచిన పోరాట యోధుల గురించి మరోసారి గుర్తు చేసే అవకాశం ఉంటుంది కదా.

● మామూలుగా మనం చదువుకుంటున్నప్పుడు దేశ, విదేశీయులు కూడా ఆ ఇన్‌స్టిట్యూషన్స్‌లో చేరుతుంటారు. అలా నేను అమెరికాలో చదువుకున్న యూనివర్సిటీలో పలు దేశాలవారిని కలిశాను. వాళ్ల దేశాల్లో ఉండే నియమ నిబంధనలు విన్నప్పుడు 'నా దేశం ఎంతో మెరుగ్గా ఉంది కదా' అనిపించింది. ఒక ఫ్రీ కంట్రీలో బతుకుతున్నప్పుడు ఆ దేశానికి మనం విలువ ఇవ్వాలి. ఆ దేశం గురించి మనం గర్వపడాలి. ముఖ్యంగా ఆడవాళ్ల విషయంలో కొన్ని దేశాల్లో హద్దులు హారిబుల్. అమ్మాయిలు బయటకు వెళ్లకూడదు... డ్రైవ్ చేయకూడదు వంటి నియమాలు చూసి, మగవాళ్ల ఆధిపత్య పోరు ఎంతలా ఉందీ అనిపించింది. అఫ్‌కోర్స్ ఇప్పుడు ఆ నియమాల్లో కాస్త వెసులుబాటు వచ్చిందనుకోండి.

● నేను యూఎస్‌లో ఓ పదేళ్ల పాటు ఉన్నాను. ట్రాన్సిల్‌వేనియాలో ఉన్న 'ఇండియన్ అసోసియేషన్' వారు 2013లో ఇండిపెండెన్స్ డే సెలబ్రేషన్స్ ఆరంభించారు. ఆ వేడుకల్లో రెండుసార్లు జెండా ఎగరేసే అదృష్టం నాకు దక్కింది. విదేశీ గడ్డ మీద మన మాతృదేశం జెండా ఎగరేయడం అనే ఫీలింగ్ మాటలకు అందనిది. పైగా మన భారతీయులు విదేశీ గడ్డపై ఐకమత్యంతో స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకోవడం అనేది నాకు బాగా అనిపించింది. నా మూలాల మీద నాకు మరింత ప్రేమ పెరిగేలా చేసింది.

స్వాతంత్ర్యదినోత్సవ థీమ్... నయా భారత్

థీమ్ అనేది అలంకారప్రాయం కాదు. మన భవిష్యత్ లక్ష్యాల గురించి బలంగా చెప్పే... సంక్షిప్త సందేశం. ఎప్పటికప్పుడు కొత్తగా ఆలోచిస్తూ, కొత్త శక్తులతో ముందడుగు వేసినప్పుడే కొత్త భారతాన్ని ఆవిష్కరించుకోగలుగుతాము. ఈ భావాన్ని ప్రతిబింబించేలా 'నయా భారత్' అని ఈ స్వాతంత్ర్య దినోత్సవం థీమ్‌ను నిర్ణయించారు.



డాలీగారి దేశభక్తి

'దేశభక్తి మీకేనా? నాకు కూడా ఉంది' అని చెప్పకనే చెప్పింది డాలీ. పెయింటర్ డాగ్‌గా పాపులర్ అయిన డాలీకి ఎంతో మంది అభిమానులు ఉన్నారు. తాజాగా త్రివర్ణ పతాకం పెయింట్ వేసి 'ఆహా' అనిపించేలా చేసింది డాలీ. 'శునక రాజమా... నీ దేశభక్తికి జోహార్లు' అంటున్నారు నెటిజనులు.



తండ్రి పేరు వందేమాతరం..!

'పేరులో పవర్ ఉంటుంది' అంటారు. కొన్ని పేర్లు వింటే 'నిజమే!' అనిపిస్తుంది. ఒడిశాలోని భువనేశ్వర్‌కు చెందిన ఈ కుటుంబసభ్యుల పేర్లలో దేశభక్తి ధ్వనిస్తుంది. తండ్రి పేరు వందేమాతరం ప్రహ్లాద్ నాయక్. కుమారుడి పేరు తిరంగా ప్రియదర్శన్. కూతురు పేరు జైహింద్ జగ్యన్‌సేని. 'మతాన్ని ప్రతిఫలించే పేర్లు కాకుండా దేశభక్తిని ప్రతిఫలించే పేర్లు అంటే నాకు ఇష్టం' అంటున్న వందేమాతరం స్వచ్ఛందసేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటాడు. వందేమాతరం ఇంటిలోని గదులు జాతీయజెండాలోని మూడు రంగులతో అలంకరించి ఉంటాయి.

ఈ అమెరికన్ మన జాతీయగీతం అద్భుతంగా ఆలపిస్తాడు!

పదిహేడు సంవత్సరాల అమెరికన్ గేబ్ మెరిట్ ఆలపించిన మన జాతీయగీతం 'జన గణ మన' సోషల్ మీడియాలో వైరల్ అయింది. 'ఓ మై గాడ్... నా హృదయం దేశభక్తితో ఉప్పొంగిపోయింది' అనే కాప్షన్‌తో ఈ వీడియోను షేర్ చేసింది దిశ అనే నెటిజన్. 'ఎన్నో దేశాల జాతీయగీతాలు పాడినప్పటికీ గేబ్‌కు మన జాతీయగీతం ఆలపించడం అంటే ప్రత్యేక అభిమానం' అని రాసింది దిశ.



అంటార్కిటికాలో వందేమాతరం





అంటార్కిటికాలోని పరిశోధన కేంద్రంలో పనిచేస్తున్న భారతీయ ఉద్యోగులు ఆగస్ట్ పదిహేను పర్వదినాన్ని పురస్కరించుకొని జాతీయజెండా ఎగరేయడానికి సన్నద్ధం అవుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. వాతావరణ ప్రతికూలతలు ఉన్నప్పటికీ 'మేము సైతం' అంటూ జాతీయపతాకావిష్కరణకు సన్నద్ధం అవుతున్న దృశ్యం నెటిజనులను ఆకట్టుకుంది. ఉద్యోగులు మంచుపెకిలిస్తుంటే, నేపథ్యంలో 'వందేమాతర గీతం' వినిపిస్తుంటుంది.


● 50 ఏళ్ల షోలే ఫంటాస్టిక్స్ (1975-2025)

షోలే... అప్పుడది తుపాన్ ఇండియా

సినిమా మొత్తం రెండు జతలకు మించి వాడని హీరోలు... హీరోయిన్ ఏమో టాంగేవాలీ... ఇంకో హీరోయిన్ వితంతువు... ముఖ్య క్యారెక్టర్ ఆర్టిస్టుకు రెండు చేతులూ ఉండవు... విలన్‌కు గట్టిగా చూస్తే 20 మందికి మించి గ్యాంగ్ లేదు... లొకేషన్ ఉత్త రాళ్లదిబ్బలు... ఇవాళ్టి పాన్ ఇండియా సినిమాలతో పోల్చి చూస్తే ఈ లక్షణాలతో ఏదైనా సినిమా సూపర్ హిట్ అవుతుందా? అవుతుంది... అయ్యింది... అవుతూనే ఉంది... 'షోలే' - ఒక ప్రెజెంట్ కంటిన్యుయెస్ టెన్స్ 50 ఏళ్లుగా 'షోలే' లిఖించిన రికార్డులు ఎన్నో. చెప్పిన కొటేషన్లు మరెన్నో. 'జో డర్ గయా... సమ్‌ఝో మర్‌గయా'... మరణమే లేని షోలేతో ప్రేక్షకుల వీడని దోస్తీ గురించి ప్రత్యేక కథనం...







'పుష్ప' సినిమా రెండు పార్ట్‌లుగా వచ్చి కోట్లు సంపాదించింది.

ఒక గంధపు చెక్కల స్మగ్లర్ హీరోనా అని ఒకరిద్దరు క్వశ్చన్ చేశారు.

కాని సగటు జనం జానేదో అని సూపర్‌హిట్ చేశారు.

ఈ సగటు జనం ఇక్కడి వరకూ చేయడానికి చాలా మెట్లు పడ్డాయి.

వాటిలో 'షోలే' ఒకటి.

***

సలీమ్-జావేద్ హిందీలో యాంగ్రీ యంగ్‌మేన్‌ను తెచ్చారు. అంటే స్వాతంత్ర్యం వచ్చాక జన్మించి, యుక్త వయసు వచ్చేనాటికి అంటే 1970ల నాటికి దేశ స్థితి చూస్తే ఆకలి, దరిద్రం, నిరుద్యోగం, బ్లాక్ మార్కెట్. రోజులు ఇలా ఉంటే అమ్మాయి వెంట పరిగెత్తి విరహగీతాలు పాడే హీరో చెల్లుబాటు కాదు అని వాళ్లు కోపంగా ఉండే హీరోని తెచ్చారు. 'జంజీర్'లో అమితాబ్ అలాంటి హీరో. ఇతను ఇన్‌స్పెక్టర్‌గా ఉంటూ కూడా తన తల్లితండ్రులను చంపిన వాణ్ణి చట్టప్రకారం శిక్షించలేకపోతాడు. యూనిఫామ్‌ను వదిలాకే పగ సాధిస్తాడు. చట్టానికి ఆవల కొన్ని పనులు చేసే హీరోలు అలా పుట్టుకొచ్చారు. ఆ తర్వాత 'దీవార్' వచ్చింది. కష్టపడి పని చేసే హీరోకు బదులు అడ్డదారిలో స్మగ్లర్‌గా మారే హీరోగా కనిపిస్తాడు అమితాబ్. సినిమాలో నిజాయతీపరుడైన శశికపూర్ ఉన్నా అందలానికి ఎదిగిన అమితాబ్‌ను ఆరాధిస్తాడు ప్రేక్షకుడు. ఈ వరుసలోనే వచ్చింది 'షోలే'. ఇక్కడ అత్యంత దుర్మార్గుడైన గబ్బర్ సింగ్‌ను సంహరించడానికి ఇద్దరు చిల్లర దొంగలను కాంట్రాక్ట్ మీద పట్టుకొస్తాడు ఊరి పెద్ద ఠాకూర్. చిల్లర దొంగల్లో వీరత్వం ఉండటం, కొంచెం మానవత్వం ఉండటంతో మేలు చేయని పోలీసుల కంటే కొద్దిగా కీడు చేసే చిల్లర దొంగలే నయం అనుకుంటారు రామ్‌గఢ్ వాసులు, తద్వారా ప్రేక్షకులు. ఆ విధంగా సకల సద్గుణ శోభితుడైన హీరోకు నూకలు చెల్లుతూ వచ్చి 'పుష్ప' వరకూ అతడు రూపాంతరం చెందాడు.

***

'షోలే' కథ అంతా రెండు లైన్లలో చెప్పొచ్చు. గొప్ప కథలు ఏవంటే కట్టె కొట్టె తెచ్చె అన్నట్టుగా చెప్పగలిగేవే. పోలీస్ ఆఫీసర్ ఠాకూర్ కుటుంబాన్ని గబ్బర్ సింగ్ చంపేశాడు. ఆ ప్రాంతానికి పీడగా మారాడు. వాణ్ణి చంపడానికి ఠాకూర్ ఇద్దరు దొంగలను కిరాయికి తెచ్చాడు. అంతే కథ. ఈ కథను మూడున్నర గంటల పాటు 70 ఎం.ఎం స్క్రీన్ మీద దర్శకుడు, నటీనటులు, రచయితలు, కెమెరామేన్, సంగీత దర్శకుడు ఎలా చూపారనేదే అసలు సంగతి. వాళ్లు ఎలా చూపారంటే అలా మరెవరూ, మరెప్పుడూ చూపలేకపోయారు. అందుకే షోలే అంటే షోలే. ఇలాంటి సినిమాలు సర్పాల తలలపై మణుల వంటివి. రీమేక్‌లని ప్రయత్నిస్తే మణులు రాళ్లయిపోతాయి. లేదా పాము కాటు తప్పదు. అందుకే 'షోలే'ను మళ్లీ మళ్లీ ముస్తాబు చేసి వదిలారు తప్ప రీమేక్ అంటే జనం తుపాకులు తీశారు.

***

'షోలే' యాక్షన్ సినిమా అనుకుంటారు. ఫక్తు కుటుంబ కథా చిత్రం. కుటుంబమే దీనికి ఆధారం. ఠాకూర్ కుటుంబాన్ని గబ్బర్ గాడు కాల్చి చంపాడు. కుటుంబం కోల్పోతే మనిషికి ఉండే బాధతో ప్రేక్షకుడు ఐడెంటిఫై అవుతాడు. ఆ రోజుల్లో మగవారి ఎర్లీ డెత్స్ వల్ల ప్రతి ఇంటా ఒక వితంతువు ఉండేది. జయభాదురి వేసిన రాధ పాత్రను ప్రేక్షకులు పోల్చుకున్నారు. భర్త పోయిన ఎన్నో ఏళ్లకు ఆమె 'జయ్' అనే అమితాబ్‌ను చూసి మళ్లీ అతనితో కుటుంబాన్ని నిర్మించుకోవచ్చేమో అని ఆశ పడుతుంది. ఆ ఆశ ప్రేక్షకులకు తెలుసు. ఆమెకో కుటుంబం ఏర్పడాలని వారూ అనుకుంటారు. జరగదు. జయ్ చనిపోతాడు. ప్రేక్షకులు అక్కడా కనెక్ట్ అవుతారు. ఏ తాడూ బొంగరం లేని వీరూ అను ధర్మేంద్ర టాంగేవాలీతో సరసం చేసి సాధించుకుంది మౌసీతో పాటు ఒక కుటుంబాన్నే కదా! ఇక కథలో ఇమామ్ గారి కుటుంబానికి వచ్చిన బాధ ఎవరు మరుస్తారు. చేతికి ఎదిగొచ్చిన కొడుకు పట్నం పోయి సంపాదిస్తాడనుకుంటే తండ్రిని ఏకాకిని చేసి గబ్బర్ చేతుల్లో ప్రాణాలు కోల్పోతాడు. కుటుంబం ఉనికే భారతదేశ సమాజపు ఉనికి. ఇన్ని కుటుంబాల ఉద్వేగాల అల్లిక కాబట్టే 'షోలే' ఆడింది. ఆడుకుంది.

***

'షోలే' ప్రివ్యూ కోసం థియేటర్‌లో కూచున్న రాజ్‌కపూర్ సినిమా మొదలైన పది నిమిషాల్లోనే మొదలయ్యే ట్రైన్ రాబరీ సీక్వెన్స్ చూసి చకితుడయ్యాడు. 'ఇదేంటి... క్లయిమాక్స్‌ను ముందే పెట్టేశారు' అన్నాడట పక్కనున్న వారితో. అవును 'షోలే' క్లయిమాక్స్ ముందే వచ్చేస్తుంది... అంత భారీగా. ఆ తర్వాత 'షోలే'ను కేవలం సన్నివేశాల బలం మీద నడుపుతారుగాని యాక్షన్ మీద కాదు. 'షోలే' క్లయిమాక్స్ కేవలం ఠాకూర్, గబ్బర్ సింగ్‌ల మీదే! చేతుల్లేని ఠాకూర్ చేతులు తెగ్గొట్టే గబ్బర్‌తో తలపడతాడు. ఇలా స్క్రీన్‌ప్లే రాసిన 'షోలే' ఆడిందంటే ఏమిటి మర్మం! అదే మిటో ఎవరూ చెప్పలేరు. చెప్పినా కొంతే. రొంతే. అంతంతే. షోలేకు వ్యాఖ్యానం లేదు.

***

1973లో మొదలెట్టి రెండేళ్ల పాటు తీశారు 'షోలే'. కార్పెట్లు అమ్మి, ఆ తర్వాత రియల్ ఎస్టేట్ చేసి సంపాదించిన డబ్బును కొడుక్కు ఇచ్చి సినిమా చేయమన్నాడు నిర్మాత జి.పి.సిప్పీ. కోటి రూపాయల సినిమా! వస్తే చాలా డబ్బులు రావాలి పోతే కోటి అన్నాడు. అందుకు తగ్గ కథ రమేష్ సిప్పీ రాయించుకున్నాడు సలీమ్ జావేద్‌లతో! అతని వేడి చూసి - వాళ్లు కూడా రంగంలో దిగారు. 'లోహా గరమ్ హై... మార్ దో హథోడా' (ఇనుము వేడి మీద ఉన్నప్పుడే సమ్మెట పోటు పడాలి) అనుకున్నారు. ఠాకూర్, గబ్బర్ సింగ్‌ల మధ్య ఇద్దరు దొంగలను ప్రవేశపెట్టి కథ అల్లారు. దీనికి ప్రేరణ అకిరా కురసావా 'సెవన్ సమురాయ్', మనం తీసిన 'మేరా గావ్ మేరా దేశ్'... ఇంకొన్ని సినిమాలు ఉన్నాయి. అన్నీ తీసుకుని మనది ఇవ్వడం కూడా విద్యే. ఆ విద్యతో తయారైన ఈ కథకు ద్వారకా దివేచా కెమెరా, రామ్ యెదేకర్ ఆర్ట్ డైరెక్షన్, ఎం.ఎస్.షిండే ఎడిటింగ్, ఆర్.డి.బర్మన్ సంగీతం... గంధపు చేతులకు మల్లెలు చుట్టాయి. మరి రమేష్ సిప్పీ ఇంత మంచి టేకింగ్‌ను ఎలా సాధించాడో అతనికే తెలియాలి.

ధర్మేంద్ర, అమితాబ్, అంజాద్ ఖాన్, సంజీవ్ కుమార్, హేమమాలిని, జయభాదురి... ఎవరికి ఎవరు తక్కువ. సత్తువ చూపడం వారికి మక్కువ.

***

'షోలే'లో ప్రతి సన్నివేశానికి, ప్రతి ఫ్రేమ్‌కు అభిమానులున్నారు. అందులోని ప్రతి చిన్న పాత్రకూ అభిమానులున్నారు. జైల్లో గూఢచారిగా పని చేసే బార్బర్ హరిరామ్, పిరిమిగా కట్టెలు అమ్మే సూర్మా భూపాలి, నమక్ తినే కాలియా, గబ్బర్‌కు బదులు పలికే సాంబా, హిట్లర్ జైలర్, ఠాకూర్ నమ్మినబంటు రామ్‌లాల్, పిల్లనిచ్చేందుకు ధర్మేంద్ర గుణగణాలు ఆరాతీసే మౌసీ, 'మెహబూబా' పాటలో మెరిసిన జలాల్ ఆగా... ప్రతి ఒక్కరూ... సినిమాను ధన్యం చేశారు... ధన్యులయ్యారు. ప్రేమ నాటకం కోసం వాటర్ ట్యాంకర్ ఎక్కిన ధర్మేంద్ర 'చక్కీ పీసింగ్' (తిరగలి తిప్పింగ్) అంటాడు. ప్రేక్షకులు నవ్వుతారు. 'సూసైడ్' అంటే ఆత్మహత్య అని ధర్మేంద్ర వల్లే జనానికి ఇంగ్లిష్‌లో తెలిసింది.

> పంచ్ డైలాగ్స్ ఫలానా దర్శకుడు వచ్చాక, ఫలానా రచయిత వచ్చాక ట్రెండ్‌లోకి వచ్చాయి అని ఎవరైనా అంటే నోటితోనే నవ్వబుద్ధవుతుంది. సకల పంచ్ డైలాగ్‌లకు బాప్ షోలే. అందులో ప్రతి మాటా ఒక పంచ్ డైలాగే. పైగా అవి నిత్య జీవితంలోకి వచ్చేసిన డైలాగులు. కొటేషన్‌లు. సూక్తులు.
>
> ● ఇజ్జత్ కీ మౌత్ జిల్లత్ కీ జిందగీ సే కయీ అచ్ఛీ హై
> (పరాభవాలతో బతికే కన్నా పరువుతో చావడం మేలు)
> ● ముఝేతో సబ్ పోలీస్ వాలోంకీ సూరతే ఏక్ జైసీ లగ్ తీ హై
> (నాకు అందరు పోలీసోళ్ల ముఖం ఒకలాగే కనిపిస్తుంది)
> ● తేరా క్యా హోగా కాలియా
> (నీ గతేంది కాలియా)
> ● తుమ్హారా నామ్ క్యా హై బసంతి?
> (నీ పేరేంటి బసంతి)
> ● దామ్ జో తుమ్ చాహో... ఔర్ కామ్ జో మై చాహూ
> (సొమ్ము మీరు కోరినంత... పని నేను చెప్పినంత)

***

'షోలే' తన శబ్దాలతో కూడా మనకు కనెక్ట్ అవుతుంది. రైలు కూతా, గుర్రపు డెక్కల చప్పుడు, జట్కా మువ్వలు, అజాన్, దూది ఏకే కవాను, కమ్మరి మోత... ఇక ఈ సినిమాకు ముందు రివాల్వరు, రైఫిలు పేలితే అలాంటి సౌండ్ వస్తుందని ప్రేక్షకులకు తెలియదు. బ్రిటిష్ స్టంట్‌మెన్ ఈ సినిమాకు స్టంట్ కొరియోగ్రాఫర్లుగా పని చేశారు. ట్రైన్ రాబరీలో ఒక బుల్లెట్ తగిలి గూడ్సు పెట్టెకు అంటించిన సర్కారు కాగితం చిట్లుతుంది. అలాంటి ఒక్క షాటు తర్వాతి కాలంలో తీయలేకపోయారు.

***

'షోలే' గొప్పతనం తెల్లార్లు చెప్పుకోవాలి. గబ్బర్ సింగ్ పేరు వాడుకుని ఒక హిట్ సినిమా తీసుకున్న మనం 'షోలే' యాభై ఏళ్ల సందర్భంగా ఉత్సవం తప్పక చేసుకోవాలి. ఈ సినిమాను తిరగేసి గుహనాథన్ కథ చెప్తే బాగుందని రామానాయుడు గారు 'కక్ష' తీశారు. ఇందులోని కొన్ని సీన్లు దర్శకేంద్రుడి 'అడవి రాముడు'కు పనికి వచ్చాయి. 'షోలే' ఎందరినో డైరెక్టర్లు అయ్యేలా చేసింది.

రైలుతో మొదలయ్యి రైలుతో ముగిసే ఈ సినిమా భారతీయ ప్రేక్షకులతో యాభై ఏళ్ల ప్రయాణం చేసింది.

ఇంకో యాభై ఏళ్లు ఇకపై చేస్తుంది.

ఏ దోస్తీ హమ్ నహీ తోడెంగే
తోడెంగే దమ్ మగర్ తేరా సాథ్ న ఛోడెంగె...
న ఛోడెంగె...

- కె.

బులియన్
(బంగారం 10 గ్రా.; వెండి కిలో) ఆగస్టు 14న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,01,310	1,03,050	1,01,350	1,03,050	1,00,950	1,01,340
బంగారం (22 క్యారెట్లు)	94,670	92,900	92,900	95,690	92,870	92,900
వెండి	1,18,300	1,18,700	1,26,000	1,18,700	1,17,700	1,27,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.